రేపటి నుంచి బడులకు వేసవి సెలవులు

- నేడు పాఠశాలలకు చివరి పనిదినం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభమైన సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు సోమవారం ముగిశాయి. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి మంగళవారం ఫలితాలను ప్రకటిస్తారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి మార్కుల రికార్డులపై వారి సంతకాలను తీసుకుంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలకు మంగళవారం చివరి పనిదినం. బుధవారం నుంచి జూన్ 11వరకు వేసవి సెలవులుంటాయి. ఈ మేరకు అకడమిక్ క్యాలెండర్‌లో పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. సెలవుల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహించొద్దని ఆదేశించింది.

రాహుల్‌ది త్యాగాల కుటుంబం

- ఆ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి
- జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్ గాంధీ కుటుంబానిది త్యాగాల చరిత్ర అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. అలాంటి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రామాయణ, మహాభారత చరిత్రలాగే స్వాతంత్ర్యం తర్వాత గాంధీ కుటుంబ చరిత్ర అంత గొప్పదని కొనియాడారు. నెహ్రూ ఎన్నికల వ్యవస్థను తెచ్చి ప్రజాస్వామ్యం కోసం పాటుపడ్డారని తెలిపారు. ప్రాజెక్టులు నిర్మించి ఆకలి చావులను నివారించారని చెప్పారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే దేశంలో రామరాజ్యం పరిఢవిల్లిందని తెలిపారు. కుల, మతాలకతీతంగా ఆయన దేశాన్ని పాలించారని గుర్తుచేశారు. అనేక పరిశ్రమలను తీసుకొచ్చి 60 లక్షల కిలోమీటర్ల మేర రోడ్లేసి, జీరో బల్బులతో వెలుగులు నింపారన్నారు.

రైళ్ల భద్రత కోసం చర్యలు

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైళ్ల కార్యకలాపాలకు సంబంధించిన భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జోన్‌లోని అన్ని స్టేషన్లలో తాగునీటి వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. రైళ్లలో నీరు నింపే వ్యవస్థను పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి లభ్యతపై ప్రయాణికుల నుంచి వచ్చిన స్పందనను ఆయన సమీక్షించారు. వేసవికాలంలో నడుస్తున్న ప్రత్యేక రైళ్ల ఆక్యుపెన్సీ, వాటి రన్నింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో అదనంగా ప్రత్యేక రైళ్ల ఆవశ్యకత, వాటి విస్తరణ గురించి ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఏం చేశారని బిజెపికి ఓటు వేయాలి?

- విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని పదేండ్ల పాటు పాలించిన బిజెపి.... ఏం చేసిందని ఓటు వేయాలని పిసిసి మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం అందరూ సమానమని చెబుతున్న క్రమంలో.... కాంగ్రెస్ వస్తే ముస్లింలకే సంపద పంచుతుందని ప్రధాని మోడీ ఎలా వ్యాఖ్యానిస్తారంటూ విమర్శించారు. కులగణన గురించి ఏనాడైనా మోడీ మాట్లాడారా?, రైతులకు గిట్టుబాటు ధర ఏది? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మణిపూర్‌లో మారణహోమం జరుగుతుంటే మోడీ వెళ్లలేదని గుర్తుచేశారు. బిజెపికి బుద్ధి చెప్పడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తాం

- సిసిఐ, చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- ఆదిలాబాద్, నిజామాబాద్, మేడ్చల్ జనజాతర సభల్లో రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రధాని మోడీ.. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇద్దరూ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం వెళ్లగక్కుతున్నారు.. ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు.. ఈ ప్రభుత్వం కూలిపోతే వారికి వచ్చే నష్టమేమీ ఉండదు.. కానీ కోట్లాది మంది పేదలకు నష్టం జరుగుతుంది.. ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తాం.. సిసిఐని తెరిపిస్తాం.. సెప్టెంబర్ 17లోపు నిజామాబాద్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తాం.. అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌ను బండకేసి కొట్టాం.. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీని కూడా అలాగే చేసి సాగనంపాలి.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభల్లో సిఎం ప్రసంగించారు. మూతపడే ప్రమాదంలో ఉన్న ఆర్‌టిసి సంస్థను కాపాడి 50వేల మంది కార్మికుల కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు. తాము అమలు చేస్తున్న పథకాలను చూసి కడుపు మండిన మోడీ, కెసిఆర్ ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో కెసిఆర్ ఒక్క డబుల్ బెడ్‌రూం కట్టలేదని.. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.25,500 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో ఎందుకు అమలు చేయలేదని అంటున్నారని.. పదేండ్ల పాలనలో పథకాలు అమలు చేయని కెసిఆర్‌ను ఏం చేయాలో ఆలోచించాలని ఓటర్లకు సూచించారు. ప్రధాని మోడీ ప్రజలను మోసం చేశారని, బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించలేదని అన్నారు. గుజరాత్‌కు బుల్లెట్‌ప్రూఫ్ రైలు, సబర్మతికి రివర్‌ను తీసుకెళ్లారని విమర్శించారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించారు.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆదరించాలని, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని అన్నారు. రూ. రెండు లక్షల రుణమాఫీని త్వరలోనే అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును నిర్మిస్తామని.. ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, అక్కడ 1900 ఎకరాల ముంపు పరిహారంపై ఒప్పిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు మళ్లీ డా.బిఆర్.అంబేద్కర్ పేరు పెడతామని హామీనిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ప్రారంభిస్తామని, కుప్టి ప్రాజెక్టు నిర్మించి, సిసిఐని తెరిపిస్తామని చెప్పారు. వరిని చివరి గింజ వరకు కొనుగోలు చేసి రూ.500బోనస్ కూడా చెల్లిస్తామన్నారు. ఇంద్రవెల్లి అమరులకు ఇండ్లు, భూములు ఇచ్చామని, స్థూపాన్ని పర్యటక క్షేత్రంగా మారుస్తామని చెప్పారు.

జనజాతర సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

సెప్టెంబర్ 17లోపు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తాం

మతం పేరుతో బిజెపి రాజకీయం చేస్తూ.. ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని నిజామాబాద్ పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో సిఎం ఆరోపించారు. మూతపడిన బోధన్ చక్కెర ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17లోపు తెరిపిస్తామని హామీనిచ్చారు. గత ఎన్నికల్లో ధర్మపురి అరవింద్ ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి.. పసుపు బోర్డును తీసుకురాకపోగా "స్పైసెస్ ఎక్స్‌టెన్షన్"నే పసుపు బోర్డు అని నమ్మించే ప్రయత్నం చేశారని విమర్శించారు. నిజామాబాద్ రైతులు గమనిస్తూనే ఉన్నారని.. ఆ దెబ్బతోనే ప్రధానమంత్రితో పసుపు బోర్డు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశామంటూ జీవోను విడుదల చేయించారని విమర్శించారు. అందులోనూ ఎక్కడ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తారో ఆ స్థలాన్ని, ఆ అంశాన్ని వివరించలేదని అన్నారు. రైతులకు అండగా ఉంటామని, అది ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పడితే జీవన్‌రెడ్డికి కేంద్ర వ్యవసాయ మంత్రిగా నియమించే బాధ్యత తాము తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని కిషన్ రెడ్డి ఎక్కడ?

- అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ పనులు ఎందుకు పూర్తి కాలేదు..?
- ఒకరు దేవుళ్ల పేరు చెబుతారు.. ఇంకొకరు పార్టీలు మారుతారు : పద్మారావు గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐదేళ్లలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంపి కిషన్ రెడ్డి చేసిందేమిటని బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ప్రశ్నించారు. హామీలు నెరవేర్చని కిషన్ రెడ్డి ఎక్కడ..? అని నిలదీశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్‌లోని రాఘవ గార్డెన్‌లో బిఆర్‌ఎస్ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదుగురు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, పట్టుబట్టి, కష్టపడి ఎంపి ఎన్నికల్లో గెలుపును సాధించాలని అన్నారు. ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానన్నారు. ఇప్పుడు ఇక్కడ పోటీ చేసే వారిలో ఒకరు నిత్యం పార్టీలు మారతారు.. ఇంకొకరు దేవుళ్ల పేరు చెబుతారన్నారు.. కానీ ప్రజలకు వారేం చేశారో చెప్పట్లేదన్నారు. ఐదేళ్లలో కేంద్రం నుంచి రూ.25 కోట్లు రావాల్సి ఉండగా.. వాటిని కిషన్‌రెడ్డి ఖర్చు పెట్టకపోవడంతో వృథా అయ్యాయని ఆరోపించారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి అడ్డగుట్ట ఎమ్మార్వో కార్యాలయంలో రేకుల షెడ్డు మాత్రం ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. అదే తాను తన సొంత నిధులతో 200 బోర్లు వేయించానని తెలిపారు. దానం నాగేందర్ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అవుతారని విమర్శించారు. బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఓయూ విద్యార్థి నాయకుడు ఎల్చల మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో విద్యార్థులకు అండగా ఉండి, పోలీసుల దెబ్బలు తమపై పడకుండా ఆపిన నాయకుడు పద్మారావు గౌడ్‌కు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్ల ఢిల్లీ గుప్పిట్లో ఉంటారని, అదే పద్మారావు గౌడ్ అయితే తెలంగాణ గళం, బలం పార్లమెంట్‌లో వినిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లక్ష్మి ప్రసన్న, బిఆర్‌ఎస్ ఇన్‌చార్జి మేడే రాజీవ్‌సాగర్, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

ఆ మూడు అంశాలే ప్రధానం

- 24 నుంచి కెసిఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగులు
- మే 10న ముగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్వహించతలపెట్టిన బస్సు యాత్ర షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. ముందుగా అనుకున్న దానికంటే రెండు రోజులు ఆలస్యంగా ఈనెల 24 నుంచి యాత్ర ప్రారంభం కానుంది. మే 10 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా కెసిఆర్ పలు జిల్లాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగులు కూడా నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 24న సాయంత్రం 5.30 గంటలకు ఆరంభమయ్యే ఈ యాత్ర... వచ్చేనెల 10న సాయంత్రం 6.30 గంటలకు సిద్దిపేటలో జరిగే బహిరంగ సభతో ముగియనుంది. ఈ సందర్భంగా ముఖ్యంగా మూడు అంశాలపై బిఆర్‌ఎస్ అధినేత ఫోకస్ చేయనున్నారు. కేంద్రంలోని బిజెపి పదేండ్లలో తెలంగాణకు చేసిందేమిటి..? ఇచ్చిందేమిటి..? అని ఆ పార్టీని ఎండగట్టటం, అసెంబ్లీ ఎన్నికల్లో హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్‌ను నిలేయటం, తెలంగాణకు బిఆర్‌ఎస్సే శ్రీరామరక్ష అనే విషయాలను ఆయన విడమరిచి చెప్పనున్నారు. కాంగ్రెస్, బిజెపిలకు ఢిల్లీ నేతలు బాస్‌లు, కానీ బిఆర్‌ఎస్‌కు మాత్రం తెలంగాణ ప్రజలే నిజమైన బాస్‌లనే నినాదాన్ని ఆయన ఎత్తుకోనున్నారు.

టెట్‌కు 48,582 మంది టీచర్ల దరఖాస్తు

- మిగిలిన 2.37 లక్షల మంది నిరుద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు గడువు శనివారంతో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ సర్వీసు టీచర్లు 48,582 మంది దరఖాస్తు చేశారు. ఉపాధ్యాయ పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఇ) మార్గదర్శకాలను జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయులు టెట్‌కు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కు 9,756 మంది, పేపర్-2 మ్యాథమెటిక్స్‌కు 22,369 మంది, సోషల్ స్టడీస్‌కు 16,457 మంది కలిపి 48,582 మంది ఉపాధ్యాయులున్నారు. రాష్ట్రంలో 1.04 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో నాలుగు వేల మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జీహెచ్‌ఎం) ఉన్నారు. వారికి టెట్ అవసరం లేదు. మిగిలిన లక్ష మందిలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణులయ్యారు. ఇంకా 70 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావాల్సి ఉన్నది. వారిలో 48,582 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టెట్‌కు 2,86,386 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428 మంది ఉన్నారు. దరఖాస్తు చేసిన వారిలో ఇన్ సర్వీసు టీచర్లు 48,582 మంది ఉంటే, మిగిలిన వారు 2,37,804 మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులున్నారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

పాలిసెట్ దరఖాస్తు గడువు 28 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2024 దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 28 వరకు పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బిటిఇటి) కార్యదర్శి, పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 28 వరకు పొడిగించామని తెలిపారు. ఆలస్య రుసుం రూ.వందతో ఈనెల 30 వరకు, రూ.300తో వచ్చేనెల 20 వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. పాలిసెట్ రాతపరీక్షను వచ్చేనెల 24న నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష నిర్వహించిన పది రోజుల్లో ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. సందేహాల కోసం 040-23222192 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నాలుగు రోజుల్లో ఐదు సభలు

- నేడు నాగర్ కర్నూల్‌లో సిఎం రేవంత్ పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటి నుంచి వరుసగా నాలుగు రోజులపాటు ఐదు సభల్లో పాల్గొనన్నారు. తొలుత మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం కొడంగల్‌లో నిర్వహించే ఎన్నికల సభలో పాల్గొన్న అనంతరం, సాయంత్రం నాగర్ కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ప్రచారంలో పాల్గొంటారు. 24న సికింద్రాబాద్‌లో దానం నాగేందర్ నామినేషన్ ర్యాలీ అనంతరం, సాయంత్రం వరంగల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. 25న చేవెళ్ల నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 26న జహీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. నాలుగు రోజుల్లో మొత్తం ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల్లో సిఎం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

రేపు ఇంటర్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. అదేరోజు ఉదయం 11 గంటలకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలు https://tsbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే.

ఎన్నికలు సజావుగా జరిగేలా పనిచేయాలి : డిజిపి

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- మూడు జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ డిజిపి రవి గుప్తా సూచించారు. ఇటు తెలంగాణ అటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఆదివాసీ గ్రామాలైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చేరుకున్న ఆయన.. అక్కడినుంచి చెన్నాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లిలో గల పోలీసు భద్రతా బలగాల క్యాంపులను సందర్శించారు. డిజిపితో పాటు అడిషనల్ డిజిపి ఇంటిలిజెన్స్ శివధర్ రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డిజి విజయ్ కుమార్, సిఆర్‌పిఎఫ్ సౌత్ జోన్ అడిషనల్ డిజిపి రవిదీప్ సింగ్, సిఆర్‌పిఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజిపి చారుసిన్హా, ఎస్‌ఐబి ఐజిపి సుమతి ఉన్నారు. క్యాంపుల సందర్శనలో భాగంగా అక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారులు సిబ్బందికి డిజిపి పలు సూచనలు చేశారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుని, అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వల్ల రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం హెలికాప్టర్ ద్వారా సారపాక ఐటిసి గెస్ట్ హౌస్‌కు చేరుకొని అక్కడ భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు, ములుగు ఎస్‌పి డా శబరీష్, భూపాలపల్లి ఎస్‌పి కిరణ్ ప్రభాకర్ ఖరే, ఎస్‌ఐబి ఎస్‌పి రాజేష్, ఓఎస్‌డి కొత్తగూడెం సాయి మనోహర్, భద్రాచలం ఎఎస్‌పి పరితోష్ పంకజ్, ఏటూరు నాగారం ఎఎస్‌పి మహేష్ జితే, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్, సిఆర్‌పిఎఫ్ అధికారులు ఆర్‌కె పాండ, ఎంకె మీన, మోహన్, రితేష్ కుమార్, డిఎస్‌పిలు, సిఐలు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న డిజిపి, ఇతర అధికారులు

పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మూడు జిల్లాల ఎస్‌పిలతో ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెక్ పోస్టుల వద్ద పనిచేస్తున్న అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అక్రమ నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని తెలిపారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం డిజిపితో పాటు అధికారులందరూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. సమావేశంలో భద్రాద్రి

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.A.No.1052/2022 & I.A.No.1053/2022 in O.S.No.323/2017

Between:
Kothali Srinivas ....Petitioner/Plaintiff.
And:
Kommuru Apparao (died) and 5 others ....Respondents/defendants.

NOTICE TO THE 6th RESPONDENT

6. Kommuru Appalaswamy S/o late Apparao, Hindu, aged about 45 years, residing at D.No.8-2-269/19/71/1/A, Indira Nagar, Road No.2, Banjara Hills, Near Pothammathalli Temple, Hyderabad, Telangana State-500034.

Please take notice that the above matters i.e., I.A.No.1052/2022 and 1053/2022 stands posted to 08.05.2024 for the appearance of the 6th respondent before the Honourable Court of the Senior Civil Judge at Vizianagaram by **10.30 a.m.** If you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 08.05.2024** in person or through an advocate, the above matters will be decided in your absence and ex parte.

B.R. Appalanaidu
Advocate,
304, Pride Home I Apartment,
Contonment, Vizianagaram.
Cell No: 9441216313

మెదక్‌లో కాంగ్రెసేతర పార్టీలదే హవా

- బోనీ కొట్టేందుకు కాంగ్రెస్ వ్యూహ రచన
- 1980లో ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం
- 1999 నుంచి గెలవని కాంగ్రెస్
- బిజెపి ఒకసారి, బిఆర్‌ఎస్ ఐదుసార్లు గెలుపు
- మెదక్‌లో సిఎం వర్సెస్ మాజీ సిఎం అన్నట్టు పోటీ
- స్వయంగా ప్రచారంలో పాల్గొంటున్న ఇద్దరు నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పాతికేళ్లుగా కాంగ్రెసేతర పార్టీలదే హవా నడుస్తోంది. ఒక సారి బిజెపి, ఐదు సార్లు బిఆర్‌ఎస్ గెలిచింది. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీనే అధిక సార్లు గెలిచింది. 1980లో ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచి దేశ ప్రధాని అయ్యారు. మాజీ సిఎం కెసిఆర్, ఆలె నరేందర్, విజయశాంతి లాంటి ఉద్దండులు మెదక్ ఎంపీగా గెలిచారు. పాతికేళ్ల అపజయాల నుంచి బయటపడి గెల్చి తీరాలన్న కసితో కాంగ్రెస్ ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక వ్యూహ రచన చేస్తూ ప్రజాధరణ ఉన్న బీసీ అభ్యర్థిని పోటీకి దించారు. తానే ఎన్నికల ప్లాన్ రచిస్తూ నేరుగా ప్రచార రంగంలోకి దిగారు. బీఆర్‌ఎస్ సైతం డబుల్ హ్యాట్రిక్ కోసం కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగారు. మెతుకు సీమ ఓటర్లు తీర్పు ఎటువైపో వేచి చూడాలి.

మెదక్ లోక్‌సభకు జరిగిన ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే.. పాతికేండ్లుగా ఇక్కడ కాంగ్రెస్ బోని కొట్టలేక పోయింది. అంతకు ముందు మాత్రం కాంగ్రెస్ గాలే వీచింది. గత నాలుగు సాధారణ ఎన్నికలతో పాటు ఒక ఉప ఎన్నిక జరుగగా వరుసగా బీఆర్‌ఎస్ గెలుస్తూ వచ్చింది. 2004లో జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ నుంచి ఆలె నరేంద్ర, 2009లో విజయశాంతి గెలిచారు. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ మెదక్ పార్లమెంట్‌కు పోటీ చేసి గెలిచారు. కేసీఆర్ ఎంపీ పదవికి రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బిఆర్‌ఎస్ ఎంపిగా కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచారు. 2019 ఎన్నికల్లోనూ కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండో సారి ఎంపి అయ్యారు. బిఆర్‌ఎస్ డబుల్ హ్యాట్రిక్ కోసం మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని పోటీకి దించింది. ఆయన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బాగా పరిచయాలున్న వ్యక్తి కావడం, ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండటంతో ప్రచారంలో ముందున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు స్వరంగా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. కానీ ఈ సారి మాత్రం కాంగ్రెస్ మెదక్‌లో ఖాతా తెరవాలని చూస్తోంది. మెదక్ పరిధిలో ఉన్న సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నప్పటికీ అమలు చేసిన పథకాలపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. అభ్యర్థి నీలం మధు ముదిరాజ సామాజికత కూడా కలిసొస్తుందని భావిస్తుంది. రెండున్నర దశాబ్దాల నుంచి గెలవలేక పోయిన కాంగ్రెస్ ఈ సారి సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఖచ్చితంగా గెల్చి తీరాలన్నట్టు పని చేస్తోంది. రేవంత్‌రెడ్డి తనదైన వ్యూహాలతో బిఆర్‌ఎస్, బిజెపిలను పక్కకు నెట్టి గెల్చుకుంటామని ధీమాలో ఉన్నారు. బిజెపి కూడా పోటీ చేస్తున్నప్పటికీ బిఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మద్దే పోటీ జరగనుంది.

సిఎం వర్సెస్ మాజీ సిఎం

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థుల మధ్య పోటీ కంటే సిఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ మాజీ సిఎం కెసిఆర్ అన్నట్లుగా కనిపిస్తుంది. వ్యూహ ప్రతివ్యూహాలతో రాటుదేలిన ఆ ఇద్దరూ మెదక్ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కెసిఆర్ సొంత ఇలాకైన మెదక్ పార్లమెంట్ స్థానాన్ని గెల్చుకునేందుకు గులాబీ దళపతి రంగంలోకి దిగారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎన్నికల బాధ్యతలు అప్పజెప్పడమే కాకుండా తాను సైతం ఎన్నికల ప్రచారంలోకి వస్తున్నారు. ఈ నెల 16న అందరి కంటే ముందే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అంచనాలకు మించి జనాలు సభకు హాజరుకావడంతో క్యాడర్‌లో జోష్‌ను పెంచేలా కెసిఆర్ ప్రసంగించారు. సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. లిల్లీపుట్ గాళ్లంటూ హేళన చేశారు. కరెంట్ కోతలు, ఎండిన పంటలు, వడ్ల కొనుగోలు వంటి ఆంశాలను ఎన్నికల ఎజెండా చేయగలిగారు. మరో పక్క కేసీఆర్‌ను ఢీ కొనేలా సిఎం రేవంత్‌రెడ్డి సైతం మెదక్‌లో దూకుడు పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి ఈ నెల 20 రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ర్యాలీ, సభలో పాల్గొని కేసీఆర్, హరీశ్‌రావు వైఫల్యాన్ని ఎండగట్టారు. మంత్రి కొండా సురేఖను నియోజకవర్గ ఇన్‌చార్జిగా పెట్టి మైనంపల్లి హనుమంతరావుకు సిద్దిపేట బాధ్యతలు అప్పజెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు ఎత్తులను చిత్తు చేసేలా పావులు కదుపుతున్నారు. మెదక్‌లో రేవంత్‌రెడ్డి కేసీఆర్ ఇద్దరూ అభ్యర్థుల కంటే ఎక్కువ పట్టించుకోవడం విశేషం.

ఆరుగురు ఎమ్మెల్యేలు.. ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు

మెదక్‌పరిధిలో ఆరుగురు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే లుండటంతో బీఆర్‌ఎస్‌లో ధీమా కనిపిస్తుంది. ఎమ్మెల్యేల బలంతో పాటు ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హరీశ్‌రావు, రాజకీయ చతురత కల్గిన కేసీఆర్ ఇద్దరిదీ మెదక్ పార్లమెంట్ సొంత ఇలాక కావడంతో క్యాడర్‌లో జోష్ కనిపిస్తుంది. పైగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల కంటే బిఆర్‌ఎస్ అభ్యర్థులకు రెండు లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. అంటే రెండు లక్షల ఓట్ల అదనపు బలంగా బీఆర్‌ఎస్ భావిస్తుంది.

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ బలం

సిఎం రేవంత్‌రెడ్డి స్ట్రాటజీ, మంత్రుల ప్లానింగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌కు బలంగా కనిపిస్తుంది. ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఆరోగ్య శ్రీని రూ.10 లక్షలకు పెంచడం వంటి పథకాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ, ఖరీఫ్ నుంచి బోనస్ అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రకటన కూడా రైతాంగంలో సానుకూలత తెస్తుందని అనుకుంటున్నారు. కాగా, ముదిరాజ్ ఓట్లు అధికంగా ఉన్న మెదక్‌లో నీలం మధుకు కలిసొస్తుందా చూడాలి.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి. 9/2023

చీదెళ్ల అనురాధ అలియాస్ అలవాల అనురాధ,
వయసు: 24 సం॥, భర్త: వెంకటరమణారావు,
తండ్రి: అలవాల లక్ష్మీనారాయణ,
నివాసం: ఇంటి నెం: 10-813-13,
దత్తసాయి గుడి దగ్గర, విజయా టాకీస్ రోడ్డు,
మార్కాపురం టౌన్ అండ్ మండలం,
ప్రకాశం జిల్లా ...పిటీషనర్

వర్సెస్

చీదెళ్ల వెంకటరణారావు, తండ్రి: భాస్కర్‌రావు,
వయసు: 30 సం॥, ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి, నివాసం,
వెంకటరావు నగర్, ఇంటి నెం: 5-3-318-2ఎ,
కమ్యూనిటీహాల్ దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్,
రంగారెడ్డి జిల్లా. ...రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్ రెస్పాండెంట్‌కు నోటీసు జారీ చేయు నిమిత్తం ఎన్నిసార్లు నోటీసు బస్తా కట్టిననూ, రెస్పాండెంట్ ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టువారు రెస్పాండెంట్‌కు నోటీసు జారీ చేయుటకు ప్రజాశక్తి పేపరు ద్వారా తెలియ జేయమన్నారు. కాబట్టి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నోటీసును పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. వాయిదా 01-05-2024న ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరుగానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ఆకుల ఉషశ్రీ
అడ్వకేట్, మార్కాపురం.

వాడవాడలా సిపిఎం ర్యాలీలు

- భువనగిరి అభ్యర్థి జహంగీర్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం
- బిజెపి మూడోసారి అధికారంలోకొస్తే దేశాన్ని అమ్మేస్తుంది
- అవకాశవాద రాజకీయాలను తరిమికొట్టాలి
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- ఎర్రజెండాకు పూర్వవైభవం : ముదిరెడ్డి

మట్టి తట్టను ఉపాధి కార్మికురాలి తలపై పెడుతున్న జహంగీర్, మట్టిని తవ్వేందుకు పలుగులతో జూలకంటి, ముదిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల పక్షపాతి, ఎర్రజెండా ముద్దుబిడ్డ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జంహగీర్ గెలుపు కోరుతూ కార్యకర్తలు, నేతలు కళాకారుల బృందాలతో కలిసి వాడవాడలా జనాన్ని కదిలిస్తున్నారు.. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే ఎర్రజెండా చరిత్రను పోరాటాల గడ్డపై పునరావృతం చేయడానికి కార్మికులు, కర్షకులు ప్రచారంలో ముందుకు కదులుతున్నారు. సోమవారం మునుగోడు, చండూరు మండలాల్లో ర్యాలీలుగా బయలుదేరి ఇంటింటికీ ప్రచారం చేశారు. జనంలో చైతన్యం తీసుకొచ్చేలా కళాకారుల ఆటపాటలతో ఆకట్టుకున్నారు.

బిజెపి మూడోసారి అధికారంలోకి వస్తే దేశాన్ని స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు హోల్‌సేల్‌గా అమ్మేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. మునుగోడు, చండూరు మండలాల్లో నిర్వహించిన ప్రచార ర్యాలీల్లో ఆయన ప్రసంగించారు. పదేళ్లుగా బిజెపి కార్మికులు, రైతు,పేదవాళ్ల వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని పౌరహక్కులను కాపాడు కునేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రజా సమస్యలను విస్మరించి అహంకారపూరితంగా వ్యవహరించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అవకాశవాదులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని చెప్పారు. సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న ఈ సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పూటకో పార్టీలు మార్చే నాయకులను ఓడించాలని కోరారు. మునుగోడు నియోజకవర్గ వెనుకబాటుకు గత పాలకులే కారణమని తెలిపారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలు, సాగు, తాగునీరు కోసం పోరాటాలు నిర్వహించడంలో సిపిఎం కీలకపాత్ర పోషించిందని చెప్పారు. బిజెపి అభ్యర్థిగా బూర నర్సయ్యగౌడ్ గతంలో ఆయన చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాలన్నారు. ప్రజా పోరాటాల ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, తనకు ఓటేసి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుంచడానికి నిరంతరం పని చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం నిజాయితీగా, నికరంగా, అవినీతికి తావులేకుండా ప్రజాసమస్యలపై పోరాడే తమను ఆశీర్వదించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎర్రజెండాకు పూర్వ వైభవం
సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో ఎర్రజెండాకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా కార్యకర్తలు గ్రామ గ్రామాన ఎర్రజెండా చేసిన పోరాటాలను ప్రజలకు వివరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గతంలో నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక ఓట్లు సాధించిన వ్యక్తి రావి నారాయణరెడ్డి అని అన్నారు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో కమ్యూనిస్టుల పాత్ర ఏందో ప్రజలందరికీ తెలుసునన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న రైతులు

రైతులను నిండా ముంచిన అంకుర్ సీడ్స్

- రైతుల నిరసన.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంకుర్ సీడ్స్ వాడితే మంచి దిగుబడి వస్తుందని రైతులకు ఆశ చూపి మాయమాటలు చెప్పి.. దిగుబడి వచ్చాక ఆ సీడ్స్‌ను తామే కొనుగోలు చేస్తామని నమ్మించి నిండా ముంచిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతులు చేసేదేమీ లేక సోమవారం అంకుర్ సీడ్స్ వరితో రోడెక్కి ధర్నా చేశారు. బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండల కేంద్రానికి చెందిన 23మంది రైతులకు అంకుర్ సీడ్స్ వాడితే బాగా దిగుబడి వస్తుందంటూ 86 ఎకరాలకు సరిపోను ధాన్యాన్ని అంకుర్ సీడ్స్ ప్రతినిధులు ఇచ్చారు. దాంతో రైతులు దండు రాములు, దయ్యాల భద్రయ్య, మల్లయ్య, వడ్లకొండ దుర్వాసులు, వడ్లకొండ తిరుపతి, మామిండ్ల సారంగపాణి, పొట్లూరి సురేష్, రవి, కుమార్, తదితర రైతులు అంకుర్ సీడ్స్ వరి సాగు చేస్తున్నారు. 130 రోజులకు పంట దిగుబడి వస్తుంది. 60 రోజులకు పొట్టకు రావాల్సి ఉండగా 35 రోజులకే వచ్చింది. దాంతో ఆందోళన చెందిన రైతులు కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించారు. అప్పటి నుంచి కంపెనీ ప్రతినిధులు రైతుల ఫోన్లు ఎత్తకుండా నిర్లక్ష్యం వహించారు. దాంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వేసిన పంట కూడా ఎకరాకు ఐదు బస్తాలు కూడా రాని పరిస్థితి. మొత్తం ధాన్యం తాలుగా ఉంది. దాంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సాంబమూర్తి.. సీడ్స్ ప్రతినిధులతో మాట్లాడి రెండు రోజుల్లో రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెళ్లిపోయారు.

హైదరాబాద్‌లో రూ.4 వేల కోట్ల ఆస్తుల విక్రయం

- నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

హైదరాబాద్ : నగరంలో అధిక విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ప్రస్తుత ఏడాది మార్చిలో రూ.4,000 కోట్ల పైగా విలువ చేసే ఆస్తులు విక్రయించబడ్డాయని సోమవారం ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. మొత్తం 6,416 నివాస ప్రాపర్టీలు నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే విలువ 12 శాతం పెరిగింది. గత నెల రిజిస్ట్రేషన్ అయిన వాటిలో దాదాపు 70 శాతం గృహాలు 1,000 నుండి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. అయితే 16 శాతం ఆస్తులు రూ. కోటి కంటే ఎక్కువ విలువ చేసేవి ఉన్నాయి. ధరల పరంగా రూ. 25 లక్షల నుండి 50 లక్షల శ్రేణిలో ఉన్న ఆస్తుల వాటా 45 శాతంగా ఉన్నాయి. కాగా.. రూ.25 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఆస్తుల వాటా మొత్తం రిజిస్ట్రేషన్లలో 14 శాతానికి తగ్గింది. మరోవైపు రూ.1 కోటి పైగా ధర ఉన్న ప్రాపర్టీల రిజిస్ట్రేషన్‌లలో భారీ పెరుగుదల కనిపించింది. వీటి వాటా 2023 మార్చిలో 10 శాతంగా ఉండగా.. మార్చి 2024 నాటికి 16 శాతానికి పెరిగింది. ఈ రిపోర్ట్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలను పరిగణలోకి తీసుకుంది.

233 స్టోర్లకు విస్తరించిన వెస్ట్‌సైడ్

హైదరాబాద్ : టాటా గ్రూపునకు చెందిన వెస్ట్‌సైడ్ 233 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. తమ నూతన స్టోర్‌ను పంజాగుట్ట వద్ద ప్రారంభించడం ద్వారా ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. దీన్ని 36,288 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇక్కడ అనేక బ్రాండ్లకు చెందిన దుస్తులు, ఉపకరణాలు, సౌందర్య సాధనాలు, పాదరక్షలు తదితర ఉత్పత్తులు లభించనున్నాయని పేర్కొంది.

భూమిపోతే ఆత్మహత్యలే శరణ్యం

- గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే
- అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల నుంచి వరంగల్ వరకు చేపడుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వ్యవసాయ భూములు పోతే ఆత్మహత్యలే శరణ్యమని ములుగు జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట బాధిత రైతులు స్పష్టం చేశారు. సోమవారం ఇస్సిపేట శివారులో చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేను రైతులు అడ్డుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా నుంచి హన్మకొండ జిల్లా ఊరుకొండ వరకు చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవే.. మండలంలోని మొగుళ్లపల్లి, మేదరమెట్ల, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల ద్వారా వెళుతుంది. అర్ఐ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులు సర్వే నిర్వహిస్తుండగా రైతులు పురుగుల మందు డబ్బాను పట్టుకొని నిరసన వ్యక్తం చేసి సర్వేను అడ్డుకున్నారు. జాతీయ రహదారికి ఎట్టి పరిస్థితుల్లో వ్యవసాయ భూములు ఇవ్వమని భూ నిర్వాసిత రైతులు తెలిపారు. జాతీయ రహదారిలో చాలామంది రైతులు తమ వ్యవసాయ భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా భూమిని నమ్ముకుని వ్యవసాయాన్ని చేస్తున్న తమకు.. భూమి పోతే జీవనోపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు ప్రకారం కాకుండా ప్రభుత్వ రేటు ప్రకారం భూములకు ధరలు నిర్ణయించడం రైతులను మోసం చేయడమేనన్నారు. బలవంతంగా రోడ్డు నిర్మాణం పనులు చేపడితే కుటుంబమంతా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అనంతరం రైతులందరూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునితకు సర్వేను అపాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, అన్నారెడ్డి, లింగారెడ్డి, ముత్తరెడ్డి, సంపత్‌రావు, కృష్ణ, కొమురయ్య, సుధాకర్ రావు, నరసింగరావు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సునితకు సర్వేను అపాలంటూ వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆగస్టు15 లోపు రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తావా?

- సిఎంకు హరీశ్‌రావు సవాల్
- హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగస్టు 15లోపు రూ.39 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయకపోతే పదవికి రాజీనామా చేస్తావా అంటూ సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఇప్పటికీ రైతుబంధే పూర్తిగా ఇవ్వలేదని.. అలాంటిది ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదన్నారు.

వారిచ్చిన గ్యారంటీలే పార్లమెంట్ ఎన్నికల్లో వారికి భస్మాసురహస్తం అవుతాయంటూ తెలిపారు. బిఆర్ఎస్‌ను ఎందుకు ఓడించాలో ఒక్క కారణం చెప్పాలని, కాని కాంగ్రెస్‌ను ఓడించడానికి 100 కారణాలున్నాయన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2500 సాయం, కల్యాణ లక్ష్మికి తులం బంగారం, నిరుద్యోగ భృతిపై మాట తప్పడం లాంటి ఎన్నో మోసాలు చేసిన కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అంటేనే మాటల కోతలు.. కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలు అంటూ ఎద్దేవా చేశారు. నాలుగున్నర నెలల్లోనే ఏదేదో చేసినట్టు.. ఓటేయకపోతే పథకాలు బంద్ అవుతాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ అంటే కరువు, కరెంట్ కోతలు, మంచినీళ్ల కష్టాలు, అవినీతి అని విమర్శించారు. కాబట్టి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి.. బిఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు

- శ్రీరామనవమి రోజు నిబంధనల ఉల్లంఘన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమతించిన సమయం తర్వాత కూడా శ్రీరామ నవమి విశాల్ శోభాయాత్రను నిర్వహించడం పట్ల బిజెపి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న ఎమ్మెల్యే రాజాసింగ్ ధూల్‌పేట్ నుంచి సుల్తాన్ బజార్ హనుమాన్ వ్యాయామశాల వరకు విశాల్ శోభాయాత్ర నిర్వహించారు. అయితే, ఈ సభకు ఆరోజు రాత్రి పది గంటల వరకే అనుమతి ఉంది. రాత్రి 11 గంటల 15 నిమిషాల వరకు శోభాయాత్ర, సభ నిర్వహించడంతో సుల్తాన్‌బజార్ ఎస్ఐ మధుసూదన్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్, బిజెపి నాయకులు శైలేందర్, ఇతర నాయకులపై 188, 290, ఆర్/ డబ్ల్యూ 34, సిటీ పోలీస్ యాక్ట్ 21/76 కింద కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్రమశిక్షణ కలిగిన కార్యకర్త లింగయ్య

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రమశిక్షణ కలిగిన కార్యకర్త, సిపిఎం పట్ల అచెంచల విశ్వాసం కలిగిన వ్యక్తి అయితబోయిన లింగయ్య అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో అనారోగ్యంతో చనిపోయిన లింగయ్య మృతదేహంపై సోమవారం పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగయ్య చిన్ననాటి నుంచి మార్క్సిజం పట్ల నమ్మకం.. ఎర్రజెండా మీద ఉన్న ప్రేమతో పార్టీ చేసే పోరాటాల్లో అమరజీవి ధనియాకుల గురవయ్య మార్గదర్శంతో నడిచారన్నారు. పేద ప్రజల విముక్తి మార్గం ఎర్రజెండా అని తుదిశ్వాస వరకు విశ్వసించారన్నారు. ఎంతో మంది పార్టీలు మారినా ఆ ఎర్రజెండాను వీడలేదని చెప్పారు. అవకాశవాద రాజకీయాలను దరిచేరనీయకుండా, అనేక ఆటుపోట్లు వచ్చినప్పటికీ జెండాను వీడని లింగయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. లింగయ్యకు నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, నాయకులు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, రణపంగ కృష్ణ, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీను, నర్సయ్య, నాగరాజు, అయితబోయిన రాంబాబు, వెంకన్న, సత్యం, పురుషోత్తం, భిక్షం, నాగరాజు, సతీష్, నాగార్జున, శ్రీకాంత్, వెంకన్న, అభిలాష్, తారమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

నివాళులర్పించిన మాజీ మంత్రి

టిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు అయితబోయిన రాంబాబు తండ్రి లింగయ్యకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపిపి నెమ్మాది భిక్షం, పిఎసిఎస్ చైర్మన్ నాతల జానకిరాంరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగంధర్, సూర్యాపేట జడ్‌పటిసి జీడి భిక్షం, రాపర్తి మహేష్‌కుమార్, ధనియాకుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

లింగయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి తదితరులు

విభజన హామీలు నెరవేరేది ఎప్పుడు?

- కలగానే మామునూరులో విమానాశ్రయం
- వరంగల్ సమస్యలపై పార్లమెంటులో పోరాడే ఎంపి కావాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగబద్ధంగా పార్లమెంటు సాక్షిగా తెలంగాణ విభజన సమయంలో వరంగల్ ప్రజలకు ఇచ్చిన విభజన హామీలతోపాటు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న మామునూరులో విమానాశ్రయం, వరంగల్ నగరంలో అండర్ డ్రయినేజీ, టెక్స్‌టైల్ పార్క్ లాంటి హామీలు ఎప్పుడు నెరవేరుతాయని వరంగల్ ప్రజలు ఎదురుచూస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సమస్యల కోసం పార్లమెంట్‌లో పోరాడే అభ్యర్థిని గెలిపించాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. కాగా, ఏపీ పునర్విభజన చట్టంలో కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అప్పటి కేంద్ర ప్రభుత్వం పొందుపరిచింది. పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు గడిచినా ఇంతవరకు ఒక్క హామీని కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెరవేర్చలేదు. గతంలో ఈ ప్రాంతం నుంచి గెలిచిన వారు కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేదన్న ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయి.

కోచ్ ఫ్యాక్టరీ కోరిక తీరేదెప్పుడు?

వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాదిమందికి ఉద్యోగ కల్పన కల్పించే అతి ప్రధానమైన కోచ్ ఫ్యాక్టరీ దశాబ్దాల కాలంగా వరంగల్ ప్రజలను ఊరిస్తూనే ఉంది. కేంద్రంలో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పుతామని హామీ ఇచ్చింది. కానీ ఆ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడంతో హామీలన్నింటినీ పక్కకు పడేసింది. దేశంలో సరిపడా రైల్వే వ్యాగన్లు ఉన్నాయని ఇప్పుడు కోచ్ ఫ్యాక్టరీ అవసరం లేదని బిజెపి ప్రకటించి దాన్ని గుట్టు చప్పుడు కాకుండా గుజరాత్‌కు తరలించింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో తూతూ మంత్రంగా రైల్వే ఓవరాయిలింగ్ ఫ్యాక్టరీని మోడీ ప్రారంభించారు. దీనివల్ల ఏమీ ఉపయోగం లేదని గతంలో వార్తలూ వచ్చాయి. అలాగే, బయ్యారంలో సరిపడా ఉక్కు నిలువలు ఉన్నా ఆ ప్రాంతాన్ని కనీసం పరిశీలించకుండానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ముందుకు రావడం లేదు.

ఎట్టకేలకు ప్రారంభమైన గిరిజన యూనివర్సిటీ..

గత ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో బిజెపి అధికారంలోకి రావడానికి విభజన హామీల్లో ఏదో ఒక హామీని నిలబెట్టుకోకపోతే తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని భావించి.. ఆగమేఘాల మీద ములుగు ప్రాంతంలో ఒక ప్రయివేటు భవనంలో ప్రధాన మోడీ చేతుల మీదుగా యూనివర్సిటీని ప్రారంభించారు. అయితే అది ఎన్నికల వరకే ఉంటుందా లేక పూర్తిగా గిరిజన యూనివర్సిటీని నిర్మాణం చేస్తారా అనేది వేచి చూడాల్సిందే. వీటితోపాటు వరంగల్ మామునూరులో విమానాశ్రయం, ప్రధానంగా వర్షాకాలంలో నీట మునుగుతున్న వరంగల్ నగరాన్ని కాపాడటానికి అండర్ డ్రయినేజీ సిస్టమ్, సంగెం మండలంలో టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రధాన సమస్యలు తీరాలంటే రాబోయే ఎన్నికల్లో వరంగల్ సమస్యలపై పార్లమెంటు సాక్షిగా పోరాడే అభ్యర్థిని గెలిపించాలని వరంగల్ ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రధాని మోడీకి దేశ చరిత్ర తెలియదు

- రేణుకాచౌదరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీకి దేశ చరిత్ర తెలియదని రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి విమర్శించారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. విద్వేషాలను రెచ్చగొట్టే వారు అన్ని మతాల్లో ఉన్నారని ఆమె తెలిపారు. దేశ చరిత్రలో హిందువులు, ముస్లింలు కలిసే ఉన్నారని తెలిపారు. టెర్రరిజం, విద్వేషం కేవలం ఒక మతానికి చెందినది కాదని ఆమె చెప్పారు. మోడీ వ్యాఖ్యలపై ఎలాంటి శిక్ష వేస్తారో ఎన్నికల కమిషన్ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. విచ్చలవిడిగా అబద్దలాడే మోడీ కట్టిన మంగళసూత్రం ఆయన భార్యకు పాలిట ఉరితాడుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు దేశ చరిత్రలో ఏ ప్రధానీ రెచ్చగొట్టనంతంగా ఒక మతం మహిళల మంగళసూత్రాలను మరో మతం వారు ఎత్తుకెళ్తారని ప్రధాని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నప్పటికీ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేస్తానని ఆమె తెలిపారు.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బిజెపిని ఓడించాలి

- వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల దేశాన్ని పాలిస్తున్న కార్మిక వ్యతిరేక, మతోన్మాద బిజెపిని కార్మిక లోకమంతా ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ భవనంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.రాజు అధ్యక్షతన "పార్లమెంటు ఎన్నికలు- కార్మిక వర్గ కర్తవ్యం" అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికవర్గంపై బిజెపి పదేళ్లుగా యుద్ధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26,000 చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా వేతనాలు పెంచడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు రూ.178 బిజెపి నిర్వచించడం దారుణమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతారని తెలిపారు. సమ్మె హక్కు కాల రాయబడిందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చారన్నారు. కోట్లాది మంది అసంఘటితరంగ కార్మికులకు వర్తించే ఇపిఎఫ్ పెన్షన్ నెలకు పదివేలు పెంచాలంటే బిజెపి ప్రభుత్వానికి మనసొప్పడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. 2017లో మోడీ పార్లమెంటు సాక్షిగా కనీస మద్దతు ధరల హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై ఉపా లాంటి క్రూరమైన చట్టాలను ప్రయోగించి నిర్బంధిస్తున్నదన్నారు. ఇలాంటి బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, కె సునీత, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్, నాయకులు రాములు, వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ, పుష్ప, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జయలక్ష్మి

ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలి

- వీటితో పర్యావరణానికి తీవ్ర హాని
- ఏక్లాస్‌పూర్ గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట జిల్లా మరికల్ మండలం ఏక్లాస్‌పూర్, చిత్తలూరు గ్రామాల పరిధిలో ఉన్న ఇథనాల కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన తెలిపారు. సోమవారం ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. చిత్తలూరు గ్రామంలో ఏక్లాస్‌పూర్ రైతు మండలి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వస్తున్న విత్తనాల కంపెనీ రద్దు చెయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 28 ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నారన్నారు. గాలి, నీరు, భూమిని కాలుష్యం చేసే ఇథనాల్ పరిశ్రమలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేడు పర్యావరణ కాలుష్యం పెరిగిపోవడంతో సముద్రతీర పట్టణాలు కొట్టుకపోయే ప్రమాదాలు ఎక్కువయ్యాయన్నారు. కాలుష్యకారక పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచి పోషించడంతో భూమి మండిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా జీవకోటికి, మానవుల మనుగడకు పూర్తి ప్రమాదం ఏర్పడే అవకాశం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని భూమిని కాపాడటానికి అడవులను పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, కాలుష్యకారక పరిశ్రమలను నిలుపుదల చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలూ నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను వాడటం తగ్గించుకొని పర్యావరణానికి హాని కలిగే పనులు చర్యలు చేపట్టొద్దని సూచించారు. చెట్లను నరక వద్దని, గుట్టలను, సహజ వనరులను కాపాడాలని కోరారు. వాగుల నుంచి ఇసుకను అడ్డగోలుగా తరలించొద్దన్నారు. సహజ వనరుల పరిరక్షణ కోసం ఎవరికి వారు చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే జీవావరణం, పర్యావరణం కాపాడబడి జీవవైవిధ్యం కొనసాగుతుందన్నారు. ఏక్లాస్ పూర్ రైతు మండలి ప్రతినిధులు ఉచ్చోళ్ల రామచంద్రయ్య, మహేష్, బి రామచంద్రయ్య, ఎండి ఆలీసబ్, పూజారి రాయప్ప, వెంకటప్ప, కుమ్మరి ఆంజనేయులు, ఎండి కథల్ పాల్గొన్నారు.